నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
3 | నిజామాబాద్ శనివారం 10 ఆగస్టు 2024 | ADILABAD NIRMAL

ధని ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న ప్రత్యేక అధికారి రవి, నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

మొక్కల పెంపకం.. అందరికీ ఆరోగ్యం

సారంగాపూర్, ఆగస్టు 9 : మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని స్వచ్ఛదనం-పచ్చదనం ప్రత్యేక అధికారి రవి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని ధని జిల్లా పరిషత్ సెంకడరీ పాఠశాలలో జరిగిన స్వచ్ఛదనం-పచ్చదనం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఇంట్లో మొక్కలు పెంచుకునే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌హైమద్, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో రాజేందర్, డీపీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మికాంత్‌రావు, పాఠశాల హెచ్ఎం సలోమికర్ణ, పాల్గొన్నారు.

నిర్మల్ అర్బన్, ఆగస్టు 9 : నిర్మల్ పట్టణంలోని అంబేద్కర్ భవన్ ఆవరణలో ఏర్పాటు చేసిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రత్యేక అధికారి రవి, కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులతో కలిసి మొక్కలు నాటారు.

అధికారులతో మాట్లాడుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం ప్రోగ్రాం జిల్లా ప్రత్యేక అధికారి జీ. రవి

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

స్వచ్ఛదనం-పచ్చదనం ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి జీ. రవి

ఎదులాపురం, ఆగస్టు 9 : ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని స్వచ్ఛదనం-పచ్చదనం ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి, మెంబర్ సెక్రటరీ టీజీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ జీ. రవి అన్నారు. స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంపై సమీక్షా సమావేశాన్ని శుక్రవారం ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం అమలు తీరుపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించాలని, అంతర్గత రోడ్ల అభివృద్ధి, ప్రతి ఇంటి వద్ద స్వచ్ఛతతో పాటు పచ్చదనం కూడా ఉండే విధంగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్ పరిధిలో ఆశ కార్యకర్తలు వైద్య సిబ్బంది నిత్యం గమనిస్తూ ఉండాలన్నారు. ఆరోగ్య సర్వే నివేదిక సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రణాళికతో విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, ట్రెయినీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవియ, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, అధికారులు, సీఈవో, డీఆర్డీవో సాయన్న, డీఎంహెచ్‌వో నరేందర్, ఇరిగేషన్, డీపీవో శ్రీలత పాల్గొన్నారు.

ముథోల్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కువైట్ బాధితుడు నాందేవ్ భార్య లక్ష్మి

నా భర్తను స్వగ్రామానికి తీసుకురండి

అధికారులకు కువైట్ బాధితుడి భార్య లక్ష్మి వినతి

ముథోల్, ఆగస్టు, 9: 'కువైట్ దేశంలో ఇబ్బంది పడుతున్న నా భర్తను గ్రామానికి తీసుకురావాలి' అని ముథోల్ మండలంలోని రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నాందేవ్ భార్య లక్ష్మి అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకున్నది. ఈ మేరకు శుక్రవారం ముథోల్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసింది. ఉపాధి కోసం కువైట్‌కు క్లీనింగ్ పనుల నిమిత్తం ఏజెంట్ డబ్బులు తీసుకొని పంపించాడని తెలిపారు. కానీ అక్కడ ఎడారిలో ఒంటెలను కాసే పనిలో పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తన భర్తను ఇండియాకు తీసుకవచ్చేలా చూడాలని కోరింది.

గల్ఫ్ బాధితుడిని తీసుకువస్తాం : ఎమ్మెల్యే రామారావు పటేల్

ఖైంసా, ఆగస్టు 9: కువైట్‌లో ఇబ్బంది పడుతున్న ముథోల్ మండలంలోని రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నాందేవ్‌ను తీసుకువస్తామని ఎమ్మెల్యే రామారావు పటేల్ తెలిపారు. నాందేవ్ కుటుంబ సభ్యులు, నాయకులు ఎమ్మెల్యే వద్దకు శుక్రవారం వెళ్లి విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందించి గల్ఫ్ బాధితుడికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి ఈ విషయం తెలిపానని త్వరలో బాధితుడిని తీసుకవచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు.



నాందేవ్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

'స్వాతంత్ర్య' వేడుకలను ఘనంగా నిర్వహించాలి

సోన్, ఆగస్టు 9 : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. వేడుకల నిర్వహణపై సంబంధిత అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో పరేడ్ నిర్వహణకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. దేశభక్తిని ప్రతిబింబించేలా పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజాప్రతినిధులను వేడుకలకు ఆహ్వానించాలని, సీనియర్ సిటిజన్స్, మీడియా ప్రతినిధులకు ప్రొటోకాల్ ప్రకారం సిటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమశాఖల ఆధ్వర్యంలో శకటాలు, స్టాళ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సభావేదిక సమీపంలో విద్యుత్, తాగునీరు, టెంటు, కుర్చీలు, అంబులెన్స్, అత్యవసర మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీఆర్వో భుజంగ్‌రావు, ఆర్డీవోలు రత్నాకల్యాణి, కోమల్‌రెడ్డి, డీఎస్పీ గంగారెడ్డి, సీపీఓ బాబురావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ రాజేందర్, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భ గుడిలో కొలువుదీరిన నాగోబా విగ్రహం

నాగోబా దర్శనం కోసం బారులు దీరిన భక్తులు

భక్తజన సంద్రంగా నాగోబా

● వైభవంగా నాగుల పంచమి పూజలు ● వేలాదిగా తరలివచ్చిన భక్తులు ● దర్శనం కోసం గంటల తరబడి బారులు ● కిక్కిరిసిన ఆలయ పరిసరాలు

ఇంద్రవెల్లి, ఆగస్టు 9 : నాగుల పంచమి పూజలకు తరలివచ్చిన భక్తులతో ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లోని నాగోబా ఆలయం కిక్కిరిసింది. మహారాష్ట్రతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని ఆయా జిల్లా నుంచి కాకుండా ఉమ్మడి జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి వేలాది మంది తరలివచ్చి పుట్ట వద్ద పాలు పోసి నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. శుక్రవారం ఉదయం ఆలయంలో మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్ రావ్ పటేల్ ఆధ్వర్యంలో నాగుల పంచమి ప్రత్యేక పూజలను ప్రారంభించారు. జిల్లాతో పాటు మహారాష్ట్రలోని చంద్రాపూర్, బల్లార్ష, జివితి, కిన్వట్, నాందేడ్, మాండ్వి, పాండర్ కౌడ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. గంటల తరబడి బారులు తీరి దర్శనం చేసుకున్నారు. ఆలయ పరిసరాల్లో వెలిసిన తినుబండారాలు, హోటళ్లు, వివిధ రకాల దుకాణాల్లో వివిధ వస్తువులు కొనుగోలు చేసేందుకు వచ్చిన భక్తుల సందడి కనిపించింది. రంగుల రాట్నాల్లో చిన్నారులతో పాటు యువతీ, యువకులు ఊయాలలు ఊగుతూ సందడి చేశారు.

మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో అన్నదానం

నాగుల పంచమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజల అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు మెస్రం వంశీయులతోపాటు కెస్లాపూర్ గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వందలాది మంది భక్తులు పాల్గొని సహపంక్తి భోజనాలు చేశారు. ఎలాంటి ఇబ్బంది కలగకుండా తాగునీటి వసతిని కల్పించారు.

పోలీసుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు

నాగుల పంచమిని పురస్కరించుకొని ఇంద్రవెల్లి ఎస్ఐ దుబ్బాక సునీల్ ఆధ్వర్యంలో కెస్లాపూర్‌లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఆలయంతో పాటు దర్బార్ ప్రాంతంలో ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేశారు.

స్తంభించిన ట్రాఫిక్.. రాకపోకలకు భక్తులకు ఇబ్బందులు..

నాగోబా ఆలయం వద్ద పోలీసులు ట్రాఫిక్ నివారణకు చర్యలు తీసుకున్నప్పటికీ కెస్లాపూర్ నుంచి ముత్నూర్‌కు చెందిన రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించింది. భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వాహనాల పార్కింగ్ కోసం సరిపడా స్థలం లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలు నిలిపారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో రోడ్డుపై గంటల తరబడి వాహనాలు నిలిచాయి.

జాతర ప్రాంగణంలో భక్తుల సందడి

పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

బాసరలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బాసరలో నాగుల పంచమి సందడి

బాసర, ఆగస్టు 9 : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి కనిపించింది. నాగుల పంచమిని పురస్కరించుకొని తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు తరలివచ్చారు. గోదావరి నదిలో పుణ్యస్నానాల అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

ఆదివాసీ పోరాట యోధులను స్మరించుకోవాలి

● ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా ● ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

వేడుకల్లో నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఉట్నూర్, ఆగస్టు 9 : ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన ఆదివాసీ మహనీయుల చరిత్రను నేటి తరం తెలుసుకోవాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. శుక్రవారం ఊట్నూర్‌లోని కుమ్రం భీం ప్రాంగణంలోని కుమ్రం భీం విగ్రహానికి ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమావేశ మందిరంలో కలెక్టర్ మాట్లాడారు. గతంలో కుమ్రం భీం లాంటి మహనీయులు ఆదివాసీల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం అలాంటి సమస్యలు లేవని, చాలా మెరుగుపడ్డామని తెలిపారు. ఆదివాసీలు తమ పిల్లలను చదివించి, అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలని తెలిపారు. గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలు చాలా గొప్పవన్నారు. వాటిని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత పెద్దలపై ఉందన్నారు. గిరిజనుల సమస్యలను ప్రభుత్వానికి విన్నవించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం రోడ్లు, వంతెనలు, తాగునీటి సౌకర్యాలు మెరుగుపర్చేందుకు కృషి చేస్తుందన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో పీవో ఖుష్బూ గుప్తా విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులు కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, డీఎఫ్‌వో, నిర్వాహకులు విశ్వంరావు, పుర్క బాపురావు, మెస్రం మనోహర్, మెస్రం దుర్గు, రాజు, పెందూర్ ప్రభాకర్, తి రుపతి, బాలేరావు, శంకర్, గోపి, బొంత ఆశారెడ్డి, విఠల్‌రావు, ప్రభాకర్, ఆదివాసీ పెద్దలు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవి

ఎదులాపురం, ఆగస్టు 9 : ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని వాటిని భావితరాలకు అందించేందుకు ఆదివాసీ దినోత్సవం లాంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తున్నదని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శుక్రవారం హీరసుఖ జాగృతి సమితి ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదుట నిర్వహించిన వేడుకల్లో ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి పాల్గొన్నారు. ముందుగా హీరసుఖ దైవానికి పూజలు చేశారు. అనంతరం జెండాను ఆవిష్కరించి కుమ్రం భీం, రాంజీ గోండ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్, ఎస్పీలతో పాటు సంఘం నాయకులను సత్కరించారు. ఐటీడీఏను మరింత బలోపేతం చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిప్రి సభలో హామీ ఇచ్చారన్నారు. మంత్రి సీతక్క సూచన మేరకు ఆదివాసులతో మమేకమవుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీడీవో నిహారిక, హీరసుఖ జాగృతి సమితి అధ్యక్షుడు సిడాం రాంకిషన్, నాయకులు మేస్రం కృష్ణ, బాపురావ్, ఆత్రం అనసూయ పాల్గొన్నారు.

కుమ్రం భీం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

కుమ్రం భీం విగ్రహం వద్ద నివాళులరిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్, ఎస్పీ, పీవో

ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలు ప్రత్యేకమైనవి

-బోథ్ ఎమ్మెల్యే జాదవ్‌అనిల్

నేరడిగొండ, ఆగస్టు 9 : ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రత్యేకత ఉందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శుక్రవారం నేరడిగొండ మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై కుమ్రం భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల ఆరాధ్య దైవం గోండు వీరుడు కుమ్రం భీం పోరాటం మరువలేనిదని వని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగ జాడల్లో నడవాలని తెలిపారు. పాఠశాలలో నిర్వహించి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంబారావ్, నాయకులు అశోక్, సురేందర్, ప్రతాప్‌సింగ్, సంతోష్, ఇందల్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, ఆదివాసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.